ఉపాధి కూలీల వేతన వెతలు

- శింగనమల నియోజకవర్గం వ్యాప్తంగా రూ. 18 కోట్ల బకాయిలు
- కుటుంబ పోషణ కోసం శ్రమజీవుల ఇబ్బందులు


యర్రగుంట్లలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

గార్లదిన్నె: శింగనమల నియోజకవర్గం వ్యాప్తంగా గార్లదిన్నె, శింగనమల, బుక్కరాయసముద్రం, నార్పల, పుట్లూరు, యల్లనూరు మండలాల్లో గతంలో ముమ్మరంగా ఉపాధి హామీ పథకంలో పనులు జరుగుతుండేవి. దీంతో రోజూ వేలాది మంది కూలీలు ఉపాధి పనులు కోసం వెళ్లేవారు. ప్రతి వారం కూలీలకు బిల్లులు మంజూరయ్యేవి. ప్రస్తుతం 15 వారాలుగా ఉపాధి బిల్లులు చెల్లించలేదు. నియోజకవర్గవ్యాప్తంగా దాదాపు రూ.18 కోట్ల బిల్లులు పెండింగ్ ఉన్నాయి. దీంతో ఉపాధి కూలీలు అవసరాల కోసం ఇబ్బందులు పడుతున్నారు. సాధారణంగా ఉపాధి హామీ పథకంలో పనికి వెళ్తే వారానికి ఒకసారి బిల్లులు మంజూరు చేయాలి. ఏదైనా సాంకేతిక సమస్య ఏర్పడితే రెండు వారాల్లో బిల్లులు మంజూరు చేయాల్సి ఉంటుంది. కానీ గత 15 వారాలుగా బిల్లులు రాక పోవడంతో ఉపాధి కూలీలకు పూట గడవక నిత్యావసర సరుకుల కోసం కిరణాషాపుల్లో అప్పు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. క్షేత్రస్థాయి సిబ్బందిని బిల్లుల గురించి అడిగితే తమ చేతుల్లో ఏమీ లేదని సమాధానం చెబుతున్నారని కూలీలు వాపోతున్నారు. ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి ఉపాధి కూలీల వేతనాలు సకాలంలో చెల్లించాలని వారు కోరుతున్నారు.

నియోజకవర్గంలో ముమ్మరంగా ఉపాధి పనులు ...

నియోజకవర్గం వ్యాప్తంగా 55,144 వేలు జాబ్‌కార్డులున్నాయి. వీటిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, వికలాంగులు, ఇతర కులాలకు చెందిన వారు ఉన్నారు. ఈ ఏడాది మే నుంచి ఉపాధి పనులు జరుగుతున్నాయి. గడిచిన ఆరు నెలల్లో లక్షల పని దినాలు జరిగాయి. ప్రస్తుతం గ్రామాల్లో హార్టికల్చర్ పనులు జరుగుతున్నాయి. గత మూడు నెలలు నుంచి ఉపాధి బిల్లులు రాక పోవడంతో ఉపాధి కూలీల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. దీంతో చాలా మంది ఉపాధి పనులకు వెళ్లకుండా పట్టణాల్లో పనులకు వెళ్తున్నారు.

సాధారణంగా వారంలోపు బిల్లులు

సాధారణంగా ఉపాధి కూలీలు పనులకు వెళ్లే వారం చివరిలో టెక్నికల్ అసిస్టెంట్ కొలతలు తీసి మరుసటి రోజు కంప్యూటర్ ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తారు. అలా చేసిన వారం లోపు వారి బ్యాంకు ఖాతాల్లో నేరుగా వేతన మొత్తం జమవుతుంది. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రెండు లేక మూడు నెలలకు ఒకసారి జమ చేయడం పరిపాటిగా మారింది. గతంలో కూలీల వేతనాలు చెల్లించిన, మెటీరియల్ బిల్లులు ఆలస్యంగా వచ్చేవి. ప్రస్తుతం మెటీరియల్ బిల్లులు వచ్చినా వేతన బిల్లులు ఆలస్యంగా వస్తున్నాయి. చాలా కుటుంబాల్లో ఇద్దరు నుంచి ముగ్గురు ఉపాధి కూలీలు పనులకు వెళ్తున్నారు. బిల్లులు ఆలస్యంగా కావడంతో కుటుంబం గడవని పరిస్థితి నెలకొందని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

శింగనమల నియోజకవర్గంలో ఇలా..	
మండలం	బకాయిలు
గార్లదిన్నె	రూ.2 కోట్లు
శింగనమల	రూ.4 కోట్లు
బుక్కరాయసముద్రం	రూ.4 కోట్లు
నార్పల	రూ.4.5 కోట్లు
యల్లనూరు	రూ.1.5 కోట్లు
పుట్లూరు	రూ.2 కోట్లు

మొదటి వారంలో బిల్లులు

మండలంలో ఉపాధి పనులకు వెళ్లిన కూలీలకు గత 15 వారాలు బిల్లులు రాలేదు. ఉన్నతాధికారుల సూచన మేరకు ఈ నెల మొదటి వారంలో బిల్లులు చెల్లించే అవకాశం ఉంది. ఉపాధి పనులకు సంబంధించి బిల్లులు కూలీల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తాం. ఈ ఏడాది కూడా పనిదినాలు లక్ష్యాలు సాధించాలని క్షేత్రస్థాయి సిబ్బందికి సూచించాం.

– నాంచారమ్మ, ఏపీఓ, గార్లదిన్నె

ఉపాధి బిల్లులు కోసం ఎదురు చూపు



నిత్యావసర సరుకుల కోసం కిరాణా షాపుల్లో అప్పులు చేస్తున్నాం. ఉపాధి బిల్లులు రాక పోవడంతో అంగడిలో డబ్బు చెల్లించలేక పోతున్నాం. మళ్లీ అంగడి వద్దకు వెళ్లి సరుకులు అప్పు అడిగితే పాత బిల్లు కడితేనే కొత్తగా సరుకులు ఇస్తామంటున్నారు. మూడు నెలలుగా బిల్లులు రాలేదు, ఫీల్డు అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లను అడిగితే త్వరలో వస్తాయి అనే సమాధానం చెబుతున్నారు.

–నాగరాజు, ఉపాధి కూలీ,బూదేడు

క్లుప్తంగా

విద్యార్థులకు నైపుణ్యాలు అవసరం


విద్యార్థులు తయారు చేసిన నమూనాలను ప్రదర్శిస్తున్న దృశ్యం

బుక్కరాయసముద్రం: ఇంజినీరింగ్ విద్యార్థులకు నైపుణ్యాలు ఎంతో అవసరమని ప్రిన్సిపాల్ డాక్టర్ బాలక్రిష్ణ సూచించారు. గురువారం మండలంలోని రోటరీపురంలో ఉన్న ఎస్ఆర్ఐటీ (అటానమస్) ఇంజినీరింగ్ కళాశాలలో హ్యాండ్ మేడ్ పేపర్స్ డే సందర్భంగా హ్యుమానిటీస్, సైన్సెస్ విభాగం బీసీడీఈ, డబ్ల్యూసీ సంయుక్తంగా వ్యర్థ కాగితాలతో హ్యాండ్స్ ఆన్ వర్కషాప్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇంజినీరింగ్ విద్యార్థులకు ఏదో ఒక రంగంలో నైపుణ్యాలు ఎంతో అవసరమన్నారు. పేపర్ బ్యాగులు పర్యావరణ పరిరక్షణకు ఉపయోగపడతాయన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన పేపర్ కటింగ్ బ్యాంగులు, ఆకృతులను ప్రదర్శించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాస్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ రంజిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పెద్దమౌలాలీ, చిన్నమౌలాలీ ఊరేగింపు


క్రిష్టిపాడులో పీర్లను ఊరేగిస్తున్న దృశ్యం

పెద్దవడుగూరు: మండలంలోని క్రిష్టిపాడు గ్రామంలో గురువారం పెద్దగరిడి, చిన్నగరిడి పీర్లను ఘనంగా ఊరేగించారు. పీర్లను దర్శించుకోవడానికి చుట్టుపక్కల గ్రామాలైన కడదరగుట్టపల్లి, కొండుపల్లి, అప్పేచర్ల, ఏ.తిమ్మాపురం తదితర గ్రామాల ప్రజలు తరలిరావడంతో క్రిష్టిపాడు పెద్ద గరిడి ప్రాంగణం జన సందోహంగా మారింది. పెద్దగరిడిలో ఉన్న పెద్ద మౌలాలీస్వామి వద్దకు చిన్నమౌలాలీస్వామి వచ్చి పలకరించే కార్యక్రమం, ఆత్మీయ కలయిక భక్తులు కన్నుల పండుగగా తిలకించారు. ఈ సందర్భంగా భక్తులు చెక్కెర చదివించారు. అవాంచనీయ సంఘటనలు జరుగకుండా యాడికి సర్కిల్ సీఐ రోషన్, ఎస్ఐ చిన్నరెడ్డప్ప బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఉచిత గుండె వైద్య శిబిరం


మాట్లాడుతున్న లయన్స్ క్లబ్ సభ్యులు, కిమ్స్ సవీరా వైద్యులు

గుంతకల్లు రూరల్: కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానం సమీపంలోని వాసవీ నిత్యాన్నదాన సత్రంలో గురువారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించారు. కిమ్స్ సవీరా వైద్యులు చేపట్టిన శిబిరంలో దాదాపు 70 మందికి ఈసీజీ, టూడీ ఎకో తదితర పరీక్షలు చేశారు. ఇందులో ఐదుగురికి అవసరమని గుర్తించినట్లు లయన్స్ క్లబ్ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ప్రెసిడెంట్ గోపా లత, సెక్రటరీ చక్కా పద్మజ, ట్రెజరర్ శిరీష, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో బోల్తా-ఒకరికి గాయాలు

గుత్తి: పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్ సమీపంలో గురువారం ఆటో బోల్తా పడింది. ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న జొన్నగిరికి చెందిన మధు అనే వ్యక్తి గాయపడ్డాడు. స్థానికులు అతడిని ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

సజావుగా పింఛన్ల పంపిణీ


శింగనమల మండలం సి.బండమీదపల్లిలో పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

శింగనమల/గుత్తి/గుత్తిరూరల్/పెద్దవడుగూరు/పెద్దపప్పూరు: శింగనమల మండలంలోని సి.బండమీదపల్లి, నార్పల మండలంలోని నడిమిదొడ్డిలో గురువారం ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమణ, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే గుత్తిలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, మండలవ్యాప్తంగా పింఛన్ల పంపిణీలో ఎంపీడీఓ శ్రీనివాసులు, ఐసీడీఎస్ సీడీపీఓ, ధిల్లేశ్వరి, సూపర్‌వైజర్ నాగేశ్వరి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా పెద్దవడుగూరులో ఎంపీడీఓ గోపీకృష్ణ, మండల ప్రత్యేక అధికారి డీపై ఈఓ వెంకటరమణనాయక్, పెద్దపప్పూరులో ఎంపీడీఓ కవిత, పామిడిలో ఈఓఆర్డీ బీవీ శశికళ పింఛన్ల పంపిణీని పర్యవేక్షించారు. కాగా సర్వర్ మొరాయించడంతో పలు గ్రామాల్లో పింఛన్ల పంపిణీ ఆలస్యమైంది.

దేశంలోనే గొప్ప పుణ్య క్షేత్రం 'గూగూడు'


కుళ్లాయిస్వామిని దర్శించుకుంటున్న జొన్నలగడ్డ పద్మావతి

నార్పల: మత సామరస్యాలకు ప్రతీకగా నిలిచిన గూగూడు కుళ్లాయిస్వామి, ఆంజనేయస్వామి ఆలయాలు దేశంలోనే గొప్ప పుణ్యక్షేత్రాలని మాజీ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి అన్నారు. గురువారం ఆమె గూగూడును సందర్శించి స్వాములను దర్శించుకున్నారు. గూగూడుకు చేరుకున్న ఆమెకు గ్రామస్తులు సన్నాయి వాయిద్యాలతో ఘనంగా స్వాగతం పలికారు. మొదట కుళ్లాయిస్వామిని తర్వాత ఆంజనేయస్వామిని ఆమె దర్శించుకున్నారు. ఆమె మాట్లాడుతూ గూగూడు ఉత్సవాలు మతసామరస్యానికి ప్రతీక అన్నారు. కార్యక్రమంలో సర్పంచు రమణకుమారి, కో ఆప్షన్ మెంబర్ షాబీరా, ఈఓ శోభ, ఎంపీటీసీ రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ హక్కుల ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాసులు

తాడిపత్రి అర్బన్: ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా తాడిపత్రికి చెందిన శ్రీనివాసులు ఎంపికయ్యారు. గురువారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో శ్రీనివాసులు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే సంక్షేమ పథకాలు ఎస్సీ, ఎస్టీలకు అందేలా కృషి చేస్తానన్నారు.

'సుప్రీం' తీర్పును స్వాగతిస్తున్నాం


పామిడిలో సంబరాలు చేసుకుంటున్న ఎమ్మార్పీఎస్, దండోరా నాయకులు

గుంతకల్లుటౌన్/తాడిపత్రిఅర్బన్/పామిడి/గార్లదిన్నె: ఎస్సీఎస్టీ రిజర్వేషన్ల ఉపవర్గీకరణకు సంబంధించి సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుపై స్థానిక ఎమ్మార్పీఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. గురువారం స్థానిక అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కోకన్వీనర్ వై. భీమలింగ పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ వర్గీకరణ కోసం 30 ఏళ్లుగా ఎమ్మార్పీఎస్ పోరాటం చేస్తోందని, ఈ ఉద్యమంలో అనేక మంది అమరులైయ్యారన్నారు. రాష్ట్రాలకు ఉప వర్గీకరణ అధికారం ఉందని సుప్రీం తీర్పును స్వాగతిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ పట్టణ అధ్యక్షుడు సంపత్, నాయకులు లాలెప్ప, మస్తాన్, రంగనాయకులు పాల్గొన్నారు. అలాగే తాడిపత్రి పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు గంగరాజు, బీజేపీ పట్టణాధ్యక్షుడు ఆంజనేయులు, టీడీపీ కౌన్సిలర్ మల్లిఖార్జున, ఎమ్మార్పీఎస్ పట్టణాధ్యక్షుడు రాజారత్నం తదితరులు పాల్గొన్నారు.

అదేవిధంగా పామిడిలో ఎమ్మార్పీస్, దండోరా, ఐక్యమాదిగ సమాజ్ తదితర మాదిగ సంఘాల ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఆయా సంఘాల నాయకులు ఎంసీ సుంకన్న, లాలెప్ప, వంకరాజుకాలువ వెంకటేష్, తూర్పింటి మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు. అలాగే సుప్రీంకోర్టు తీర్పుపై గార్లదిన్నెలో ఎమ్మార్పీస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కదిరెప్ప హర్షం వ్యక్తం చేశారు.

బుగ్గ రామలింగేశ్వరుడికి నేడు అన్నాభిషేకం

తాడిపత్రి అర్బన్: అషాఢ శుద్ద పౌర్ణమి సందర్భంగా స్థానిక బుగ్గ రామలింగేశ్వరుడికి శుక్రవారం అన్నాభిషేకం నిర్వహించనున్నట్లు ఆలయ ట్రస్టు చైర్మన్ పోలిశెట్టి ఆంజనేయులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే జేసీఅస్మిత్‌రెడ్డి హాజరవుతారన్నారు. ఉదయం 5 గంటలకు అమ్మవారి పంచలోహ విగ్రహానికి పంచామృత అభిషేకంతో పూజలు ప్రారంభిస్తామన్నారు.

డాక్టరేట్ ప్రదానం


మహబూబ్ బాషా

శింగనమల: మండలంలోని చక్రాయిపేటకు చెందిన కె.మహబూబ్ బాషా తిరుపతిలోని ఎస్వీ యూనివర్శిటీలో పీహెచ్‌డీ పట్టా పొందారు. మ్యాథ్స్‌లో 'సమ్ స్టడీస్ ఆన్ డామినేటింగ్ సెట్ ఫర్‌ఫెక్ట్ డామినేటింగ్ సెట్ అండ్ బాండేజ్ నెంబర్స్ విత్ అల్గోరిథమ్స్ యూజింగ్ ఇంటెర్వెల్ గ్రాఫిక్స్' అంశంపై ప్రొఫెసర్ అనుపల్లి సుధాకర్ పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేసినట్లు మహబూబ్ బాషా తెలిపారు. ఎస్వీ యూనివర్శిటీలో పీహెచ్‌డీ పట్టా పొందడంతో యువకుడిని తల్లిదండ్రులు, గ్రామస్తులు అభినందించారు.

వ్యక్తికి గాయాలు

తాడిపత్రి రూరల్: మండలంలోని బోడాయిపల్లిలో గురువారం తెల్లవారుజామున కొందరు దాడి చేయగా బాలమద్రి (40)కి తీవ్ర గాయాలయ్యాయని పోలీసులు తెలిపారు. ఇంటి ఆవరణలో నిద్రిస్తుండగా వేటకోడవలితో దాడి చేశారన్నారు. తీవ్రంగా గాయపడ్డ అతడిని తాడిపత్రి ప్రభుత్వాస్పత్రికి అటునుంచి అనంతపురానికి తరలించామన్నారు. బాలమద్రి ఇచ్చిన ఫిర్యాదులోని వారికి విచారణలో ఎలాంటి సంబంధం లేదని తేలిందన్నారు. విచారణలో దాడికి బంధువుల ఆస్తి గొడవలు, కుళాయి నీటి విషయంలో జరిగిన వాగ్వివాదం కారణమై ఉండవచ్చని తేలిందన్నారు. బాధితుడి ఫిర్యాదులోని వారితోపాటు విచారణలో గుర్తించిన వారిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామన్నారు. నిందితులను గుర్తించి, కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.

హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

తాడిపత్రిటౌన్: ప్రభుత్వ హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో జీపుజాతా కార్యక్రమం గురువారం తాడిపత్రికి చేరుకుంది. ఈ సందర్భంగా తాడిపత్రి ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన విద్యార్థుల సమావేశంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్‌బాబు , జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రమణయ్య, కుళ్లాయిస్వామి మాట్లాడుతూ ప్రభుత్వ హాస్టల్ విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న మెస్ బిల్లులు, కాస్మోటిక్ చార్జీలు వెంటనే విడుదల చేయాలన్నారు, అలాగే పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు కాస్మోటిక్ చార్జీలు పెంచాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. శిథిలావస్థలకు చేరుకున్న హాస్టల్ భవనాలను తొలగించి కొత్త వాటిని నిర్మించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నత చదువులకు శాపంగా మారిన జీఓ 77ను వెంటనే రద్దు చేయాలన్నారు. జీపు జాతా అనంతరం జిల్లా కేంద్రంలో ఈ నెల 6న నిర్వహించే మహా ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు రాష్ట్ర సమితి అధ్యక్షురాలు సాయిస్వరూప, జిల్లా నాయకులు రాధాజ్యోతి, కోశాధికారి హనుమంతు, ఉపాధ్యక్షుడు వంశీ, తాడిపత్రి నాయకులు విజయ్, వినయ్, సోమేశ్, అశ్వత్థకుమార్, సిద్దు, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్ పంటలకు బెట్ట పరిస్థితులు


ద్రావకాన్ని కలిపే పద్ధతిపై రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

గుత్తి రూరల్: ఖరీఫ్‌లో రైతులు సాగు చేసిన వేరుశనగ, సజ్జ, కందితో పాటుగా ఇతర పంటలు ప్రస్తుతం వర్షాలు లేక బెట్ట పరిస్థితులు ఎదుర్కొంటున్నాయని, రైతులు తగిన చర్యలు తీసుకోవాలని శాస్త్రవేత్తలు సూచించారు. మండలంలోని కరిడికొండ, బాచుపల్లి గ్రామాల్లో గురువారం అనంతపురానికి చెందిన శాస్త్రవేత్తలు డాక్టర్ లక్ష్మణ్, డాక్టర్ రమేష్‌నాయక్ పర్యటించారు. కరిడికొండ గ్రామంలో రైతు వెంకటనాయుడు సాగు చేసిన సజ్జ, కంది పంట, రైతు హరికృష్ణ వేరుశనగ పంటలను శాస్త్రవేత్తలు పరిశీలించారు. వారు మాట్లాడుతూ పంటలు బెట్ట పరిస్థితులు తట్టుకునేందుకు ఒక ఎకరాకు లీటరు నీటిలో పొటాషియం నైట్రేట్ ఐదు గ్రాముల చొప్పున కలిపి పిచికారీ చేయాలన్నారు. అనంతరం రైతులకు బెట్ట పరిస్థితుల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఆర్ఏఫ్‌లు సాయికల్యాణ్, సోమశేఖర్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు


కోటంకలో 'పొలం బడి' నిర్వహించిన వ్యవసాయ అధికారులు

గార్లదిన్నె: రైతులు ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల పంటల్లో అధిక దిగుబడి సాధించవచ్చని అనంతపురం వ్యవసాయశాఖ ఏడీ రవి సూచించారు.గురువారం మండలంలోని కోటంకలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ అధికారి లక్ష్మన్నతో కలసి ఏడీ మాట్లాడుతూ రైతులు రసాయన మందులు వాడకుండా స్థానిక వనరులతో తయారు చేసే కషాయాలు పంటల్లో వాడి పురుగులు, తెగుళ్లను నివారించుకో వచ్చునన్నారు. అలాగే తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. అనంతరం వేరుశనగ పంట సాగు విధానంపై రైతులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఓ సోమశేఖర్,ఏఈఓ స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

శింగనమల: మండలంలోని తరిమెల గ్రామ సమీపంలో ఉన్న పెన్నానదిలో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను గురువారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. పెన్నానదిలో పేకాట ఆడుతున్న సమచారం రావడంతో సిబ్బందితో వెళ్లి దాడులు చేశామన్నారు. నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి, వారి నుంచి రూ.18,370, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. పేకాట, మట్కా ఆడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

8న పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు

గార్లదిన్నె: మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఈనెల 8న పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎంఈఓ చంద్రనాయక్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఆయా పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ విడుదలైందన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియజేసి, పాఠశాల నోటీస్ బోర్డులో ఉంచామన్నారు. గురువారం 3.30 గంటలకు ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలన్నారు.అలాగే విద్యార్థుల తల్లిదండ్రుల ఓటరు జాబితా నోటీస్ బోర్డులో ప్రదర్శించామన్నారు. 5వ తేదీ ఓటరు జాబితాపై అభ్యంతరాలు తెలపవచ్చన్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం


తాడిపత్రిలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం


గుంతకల్లు మండలం పాతకొత్తచెరువులో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం


శింగమల మండలం సి.బండమీదపల్లిలో పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం

తాడిపత్రి రూరల్/తాడిపత్రి టౌన్/గుంతకల్లు రూరల్/గుత్తి/గార్లదిన్నె/పెద్దవడుగూరు/పామిడి: పిల్లలకు తల్లి పాలు శ్రేయస్కరమని ఐసీడీఎస్ అధికారులు, ప్రజాప్రతినిధులు, వైద్యులు సూచించారు. గుంతకల్లు, తాడిపత్రి, శింగనమల నియోజకవర్గాల్లో గురువారం తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. వారు మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు ముర్రు పాలు తాగించడం వల్ల వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందన్నారు. పిల్లలకు ఆరు నెలలు నిండే వరకూ తల్లిపాలు తాగించాలన్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ, ఆశా, వైద్య సిబ్బందితో కలసి ర్యాలీలు నిర్వహించారు. తాడిపత్రి పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో గర్భిణులకు వైద్యులు తల్లిపాల విశిష్టతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ డేవిడ్ రాజు, డాక్టర్ మంజుల, సుమన్, ఎంపీహెచ్‌ఈఓ బాలనరసింహులు, సబ్‌యూనిట్ అధికారి శ్రీనివాసులు, ఎంపీహెచ్ఏ నాగరత్న, సూపర్‌వైజర్ బాబు పాల్గొన్నారు. తాడిపత్రి మండలంలోని భోగసముద్రంలో సూపర్‌వైజర్ విజయకుమారి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. అలాగే గుంతకల్లు మండలంలోని పాతకొత్తచెరువు గ్రామంలో వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం తల్లిపాల వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నవీన్‌కుమార్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు. గుత్తి ప్రభుత్వాస్పత్రిలో నిర్వహించిన కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్లప్ప, వైద్యులు ఎల్లా రాముడు, పవిత్ర, ఉదయ భాను, సూపర్ వైజర్ అమృత లత, స్టాఫ్ నర్సులు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు. గార్లదిన్నె మండలం యర్రగుంట్ల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి, ఏఎన్ఎం లక్ష్మి, మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్ అరుణ, హెల్త్ అసిస్టెంట్ సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు. పెద్దవడగూరు ఆస్పత్రిలో డాక్టర్ అమర్‌నాథ్, ఎంఈఓ రాముడు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాసులు తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. పామిడిలో 8,10 అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో గుత్తి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఏసీడీపీఓ నాగమణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. అలాగే శింగనమల మండలంలోని సి.బండమీదపల్లిలో తల్లి పాల వారోత్సవాల పోస్టర్లను విడుదల చేశారు. తరిమెల పీహెచ్‌సీ వైద్యాధికారి శంకర్‌నాయక్, సీహెచ్ఓ గంగాధర్, హెల్త్ సూపర్‌వైజర్ అశ్వర్థ నారాయణ తదితరులు పాల్గొన్నారు.


గుత్తి ప్రభుత్వాస్పత్రిలో పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం


గార్లదిన్నె మండలం యర్రగుంట్లలో అవగాహన కల్పిస్తున్న వైద్యులు


పెద్దవడుగూరులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పరిసరాల పరిశుభ్రత పాటించాలి


చెత్త తొలగిస్తున్న దృశ్యం

పామిడి: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఈఓఆర్డీ బీవీ శశికళ సూచించారు. గురువారం శానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. వారానికొకసారి డ్రైడే నిర్వహించాలన్నారు. దోమతెరలు వాడి దోమకాటును నివారించాలన్నారు. అనంతరం అపరిశుభ్రత ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. ఈఓఆర్డీ దగ్గరుండి స్థానిక గుత్తి బీసీసీ రోడ్డుపై ఉన్న చెత్తాచెదారాన్ని తొలగింపజేశారు. పరిశుభ్రత పాటించడం వల్ల రోగాలు దరిచేరవన్నారు. కార్యక్రమంలో ఈఓ చంద్రశేఖర్, మేస్త్రీ నాగరాజు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.